నేటి మ్యాచ్: ఢిల్లీ X కోల్‌కతా, రా.7.30 నుంచి | వేదిక: ఢిల్లీ

## జాతీయ స్థాయి బాక్సింగ్ కోచ్‌గా రమేశ్



ములుగు రూరల్, ఏప్రిల్ 28 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జాతీయ స్థాయి బాక్సింగ్ కోచ్‌గా ములుగు జిల్లాకు చెందిన మామిడిపెల్లి రమేశ్ ఎంపికయ్యారు. ఈనెల 30వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఢిల్లీలోని ఛత్రసాల్ స్టేడియంలో జరిగే 68వ ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో రాష్ట్రం నుంచి పాల్గొనే అండర్-19 బాలికల బాక్సింగ్ జట్టుకు కోచ్‌గా రమేశ్ వ్యవహరించనున్నారు.



## ఏషియన్ బేస్‌బాల్ టోర్నీకి భారత్

బ్యాంకాక్: ఏషియన్ బేస్‌బాల్ టోర్నీకి భారత మహిళల జట్టు అర్హత సాధించింది. క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా సోమవారం జరిగిన సూపర్ రౌండ్ స్టేజ్‌లో భారత్ 6-5 తేడాతో థాయ్‌లాండ్‌పై గెలిచి పసిడి పోరుకు దూసుకెళ్లింది. మంగళవారం జరిగే తుది పోరులో ఇండోనేషియాతో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. థాయ్‌లాండ్, పాకిస్థాన్ కాంస్య పోరులో తలపడనున్నాయి. ఈ టోర్నీ ఫైనల్లో నిలిచిన రెండు జట్లు నేరుగా ఏషియన్ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధిస్తాయి.

## ఐపీఎల్‌లో మ్యాచ్‌ల పెంపు?

- 2028 సీజన్‌లో 94 మ్యాచ్‌లకు ప్లాన్


ఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి కాసుల వర్షం కురిపిస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో మ్యాచ్‌ల సంఖ్యను మరింత పెంచేందుకు బోర్డు సన్నాహకాలు మొదలు పెట్టింది. 2022 సీజన్ నుంచి 10 జట్లతో 74 మ్యాచ్‌లను నిర్వహిస్తుండగా.. 2028 నాటికి మ్యాచ్‌ల సంఖ్యను 94కు పెంచాలని యోచిస్తున్నట్టు ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ తెలిపారు. ప్రస్తుతమున్న మీడియా హక్కుల కాలపరిమితి (2027) ముగిసిన వెంటనే దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశముందని ఆయన చెప్పాడు.

# వారెవ్వా వైభవ్

### ఐపీఎల్‌లో 14 ఏండ్ల బాలుడి విధ్వంసక శతకం

- 35 బంతుల్లోనే సెంచరీతో సరికొత్త చరిత్ర
- లీగ్ చరిత్రలో రెండో వేగవంతమైన సెంచరీ రికార్డు

**ఐదు ఓటముల తర్వాత రాజస్థాన్‌కు తొలి గెలుపు**



వైభవ్ (38 బంతుల్లో 101, 7ఫోర్లు, 11సిక్స్‌లు)

జైపూర్: బడి ఈడు కూడా దాటని పాలబుగ్గల పసివాడు వైభవ్ సూర్యవంశీ (38 బంతుల్లో 101, 7 ఫోర్లు, 11 సిక్సర్లు) ఐపీఎల్-18లో పాత రికార్డుల దుమ్ముదులిపి సరికొత్త చరిత్ర సృష్టించాడు. 14 ఏండ్లకే ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన ఈ బీహార్ చిచ్చరపిడుగు.. జైపూర్‌లో సృష్టించిన పరుగుల సునామీకి 2025 సీజన్‌లో వరుస ఓటముల తర్వాత రాజస్థాన్ రాయల్స్ గెలుపు బాట పట్టింది. వైభవ్ విధ్వంసక శతకానికి తోడు యశస్వి జైస్వాల్ (40 బంతుల్లో 70 నాటౌట్, 9 ఫోర్లు, 2 సిక్సర్లు) అజేయ అర్ధశతకంతో రెచ్చిపోగా.. గుజరాత్ టైటాన్స్ నిర్దేశించిన 210 పరుగుల లక్ష్యాన్ని రాజస్థాన్ 15.5 ఓవర్లలోనే రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది. మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్.. నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 209 రన్స్ చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (50 బంతుల్లో 84, 5 ఫోర్లు, 4 సిక్సర్లు), జోస్ బట్లర్ (26 బంతుల్లో 50 నాటౌట్, 3 ఫోర్లు, 4 సిక్సర్లు) రాణించారు. వైభవ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

#### చిచ్చరపిడుగు వైభవ్

కండ్లెదుట భారీ లక్ష్యం. రాజస్థాన్ గత ఐదు మ్యాచ్‌ల ప్రదర్శనతో పాటు గుజరాత్ బౌలర్ల జోరు చూస్తే రాయల్స్‌కు 'ఈ మ్యాచ్ కూడా గోవిందా!' అనుకున్నారంతా. కానీ ఇటీవలే 18 ఏండ్లు నిండిన ఐపీఎల్ కంటే తక్కువ వయసున్న వైభవ్.. జైపూర్‌లో టైటాన్స్ బౌలర్లపై పిడుగులా విరుచుకుపడ్డాడు. సిరాజ్, ఇషాంత్ శర్మ, వాషింగ్టన్, రషీద్ ఖాన్ వంటి బౌలర్లను క్లబ్‌స్థాయి బౌలర్లుగా మార్చేసి జైపూర్‌లో పరుగుల సునామీని సృష్టించాడు. మ్యాచ్‌లో వైభవ్ 101 పరుగులు చేస్తే అందులో సిక్సర్లు, బౌండరీల రూపంలోనే ఏకంగా 94 పరుగులు వచ్చాయంటే బంతిని అతడు ఎంత కసిగా బాదాడో అర్థం చేసుకోవచ్చు. సిరాజ్ తొలి ఓవర్లో తాను ఎదుర్కొన్న రెండో బంతిని లాంగాన్ మీదుగా సిక్సర్‌గా మలిచిన వైభవ్.. ఇషాంత్ శర్మ వేసిన 4వ ఓవర్లో 6, 6, 4, 6, 4తో ఏకంగా 28 పరుగులు పిండుకున్నాడు. వాషింగ్టన్ ఐదో ఓవర్లో రెండు భారీ సిక్స్‌లు, ఓ బౌండరీతో 17 బంతుల్లోనే ఐపీఎల్‌లో అతడు తొలి అర్ధ శతకాన్ని నమోదు చేశాడు. వైభవ్, జైస్వాల్ జోరుతో పవర్ ప్లేలోనే రాయల్స్ 87/0గా నిలిచింది. ఐపీఎల్‌లో తొలి మ్యాచ్ ఆడుతున్న అఫ్గాన్ బౌలర్ కరీమ్ జన్నత్ ఓవర్లో అయితే బాదుడును వైభవ్ మరోస్థాయికి తీసుకెళ్లాడు. ఆ ఓవర్లో 6, 4, 6, 4, 4, 6తో ఏకంగా 30 రన్స్ రాబట్టి 90లలోకి వచ్చాడు. రషీద్ 11వ ఓవర్లో రెండో బంతిని డీప్ మిడ్ వికెట్ మీదుగా భారీ సిక్సర్‌తో 35 బంతుల్లోనే అతడి తొలి శతకం పూర్తయింది. సెంచరీ తర్వాత వైభవ్.. ప్రసిద్ధ్ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయినా జైస్వాల్.. సారథి రియాన్ పరాగ్ (32*) గెలుపు లాంఛనాన్ని పూర్తిచేశారు. ప్రసిద్ధ్ కృష్ణ, రషీద్‌ఖాన్ ఒక్కో వికెట్ తీశారు.

#### టాప్-3 రాణించినా..

ఈ సీజన్‌లో నిలకడగా రాణిస్తున్న గుజరాత్ టాపార్డర్ బ్యాటర్లు రాజస్థాన్‌తోనూ రాణించారు. ఓపెనింగ్ ద్వయం సుదర్శన్ (39), గిల్ తొలి వికెట్‌కు 10 ఓవర్లలోనే 93 పరుగులు జోడించి టైటాన్స్‌కు శుభారంభం అందించారు. పవర్ ప్లేలో ఈ ఇద్దరూ ఓవర్‌కు రెండు బౌండరీలకు తగ్గకుండా ఆడటంతో 6 ఓవర్లకు గుజరాత్ వికెట్ నష్టపోకుండా 53 పరుగులు చేసింది. భారీ మెరుపులేమీ లేకపోయినా ఈ జోడీ నిలకడగా రన్స్ రాబట్టింది. హసరంగ పదో ఓవర్లో స్వీప్ షాట్‌తో 29 బంతుల్లో అర్ధ శతకం సాధించాడు. రెండో స్పెల్‌లో బంతినందుకున్న తీక్షణ 11వ ఓవర్లో రెండో బంతికి సుదర్శన్.. పరాగ్ చేతికి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. బట్లర్ రాకతో గుజరాత్ ఇన్నింగ్స్‌కు ఊపొచ్చింది. ఫిఫ్టీ తర్వాత గిల్.. యుద్ధ్వీర్ 14వ ఓవర్లో రెండు సిక్సర్లు దంచగా హసరంగ ఓవర్లో బట్లర్ 6, 6, 4, 6 బాది 24 పరుగులు పిండుకున్నాడు. శతకం వైపునకు సాగుతున్న గిల్‌ను తీక్షణ 17వ ఓవర్లో పెవిలియన్‌కు పంపాడు. గిల్ నిష్క్రమించినా ఆఖర్లో బట్లర్ దూకుడుతో ఆ జట్టు భారీ స్కోరు సాధించింది.

**1**

టీ20లలో అత్యంత పిన్న వయసులో శతకం చేసినవారిలో వైభవ్ (14 ఏండ్ల 32 రోజులు)దే తొలిస్థానం. మహారాష్ట్రకు చెందిన విజయ్ జోల్ (18 ఏండ్ల 118 రోజులకు) రికార్డును వైభవ్ బ్రేక్ చేశాడు.

**2**

ఐపీఎల్‌లో వైభవ్‌ది రెండో అత్యంత వేగవంతమైన శతకం. క్రిస్ గేల్ (30 బంతుల్లో) అగ్రస్థానంలో ఉన్నాడు. భారత్ తరఫున ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ వైభవ్‌దే.

#### ఐపీఎల్ ఫాస్టెస్ట్ సెంచరీలు

| | | |
|---|---|---|
| క్రిస్ గేల్ | (30 బంతుల్లో) | X పుణె |
| వైభవ్ | (35 బంతుల్లో) | X గుజరాత్ |
| యూసుఫ్ | (37 బంతుల్లో) | X ముంబై |
| మిల్లర్ | (38 బంతుల్లో) | X ఆర్‌సీబీ |

#### పిన్న వయసు సెంచరీ హీరోలు

| | |
|---|---|
| వైభవ్ సూర్యవంశీ | (14 ఏండ్ల 32 రోజులు) |
| మనీశ్‌పాండే | (19 ఏండ్ల 253 రోజులు) |
| రిషబ్ పంత్ | (20 ఏండ్ల 218 రోజులు) |
| పడిక్కల్ | (20 ఏండ్ల 289 రోజులు) |

#### సంక్షిప్త స్కోర్లు

గుజరాత్: 20 ఓవర్లలో 209/4 (గిల్ 84, బట్లర్ 50 నాటౌట్, తీక్షణ 2/35, సందీప్ 1/33); రాజస్థాన్: 15.5 ఓవర్లలో 212/2 (వైభవ్ 101, జైస్వాల్ 70*, రషీద్ 1/24, ప్రసిద్ధ్ 1/47)

#### పాయింట్ల పట్టిక

| జ | మ్యా | గె | ఓ | ఫ.తే | పా | ర.రే |
|---|---|---|---|---|---|---|
| బెంగళూరు | 10 | 7 | 3 | 0 | 14 | 0.52 |
| ముంబై | 10 | 6 | 4 | 0 | 12 | 0.88 |
| గుజరాత్ | 9 | 6 | 3 | 0 | 12 | 0.74 |
| ఢిల్లీ | 9 | 6 | 3 | 0 | 12 | 0.48 |
| పంజాబ్ | 9 | 5 | 3 | 1 | 11 | 0.17 |
| లక్నో | 10 | 5 | 5 | 0 | 10 | -0.03 |
| కోల్‌కతా | 9 | 3 | 5 | 1 | 7 | 0.21 |
| రాజస్థాన్ | 10 | 3 | 7 | 0 | 6 | -0.34 |
| హైదరాబాద్ | 9 | 3 | 6 | 0 | 6 | -1.10 |
| చెన్నై | 9 | 2 | 7 | 0 | 4 | -1.30 |

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, ఫ.తే-ఫలితం తేలనిది పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

## టీటీలో భారత్‌కు 13 స్వర్ణాలు



ఖాట్మాండు (నేపాల్): దక్షిణాసియా యూత్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్స్‌లో భారత యువ ప్యాడ్లర్లు పసిడి పతకాల పంట పండించారు. ఖాట్మాండులో ఆదివారం ముగిసిన పలు కేటగిరీలలో భారత్ ఏకంగా 13 స్వర్ణ పతకాలతో సత్తాచాటింది. అండర్-19 బాలికలు, అండర్ -15 బాలికలు, అండర్-15 బాలుర విభాగంలో మూడు స్వర్ణాలు సాధించిన భారత్.. అండర్-19, అండర్-15 డబుల్స్‌లో ఏకంగా ఆరు బంగారు పతకాలతో మెరిసింది. అండర్-19 బాయ్స్, గర్ల్స్ సింగిల్స్ ఈవెంట్స్‌లో నాలుగు పసిడి పతకాలు దక్కాయి.

## పాక్ మాజీ క్రికెటర్లకు షాక్

**భారత్‌లో అక్తర్, బాసిత్ యూట్యూబ్ చానెల్స్‌పై నిషేధం**



ఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌కు సంబంధించిన టెలివిజన్ చానెల్ ప్రసారాలపై కొరడా ఝుళిపించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా అక్కడి యూట్యూబ్ చానెళ్లనూ నిషేధించింది. ప్రభుత్వ తాజా ఆదేశాలతో పాక్ మాజీ క్రికెటర్లు షోయబ్ అక్తర్, బాసిత్ అలీ నిర్వహిస్తున్న యూట్యూబ్ చానెళ్లకు సంబంధించిన ప్రసారాలు భారత్‌లో బంద్ కానున్నాయి. జాతీయ భద్రత దృష్ట్యా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని, పాక్ యూట్యూబర్లు నిర్వహిస్తున్న చానెళ్లలోని కంటెంట్ ప్రస్తుతం భారత్‌లో అందుబాటులో ఉండదని యూట్యూబ్ ఒక ప్రకటనలో తెలిపింది. పాక్‌కు చెందిన ప్రముఖ డాన్ న్యూస్, సామా టీవీ, ఎఆర్‌వై న్యూస్, జియో న్యూస్ వంటి టీవీ చానెళ్లపై కేంద్రం ఇప్పటికే నిషేధం విధించిన విషయం విదితమే.



న్యూఢిల్లీలో సోమవారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పౌర పురస్కారాలు అందుకుంటున్న పీఆర్ శ్రీజేష్ (పద్మభూషణ్), రవిచంద్రన్ అశ్విన్ (పద్మశ్రీ)

## ఫైనల్లో ఏడుగురు



అమ్మాన్(జోర్డాన్): జోర్డాన్ వేదికగా జరుగుతున్న ఏషియన్ జూనియర్ బాక్సింగ్ టోర్నీలో భారత బాక్సర్ల జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. అండర్-17లో ఆరుగురు మహిళలు, ఏడుగురు పురుషులు ఫైనల్స్‌కు దూసుకెళ్లి కనీసం రజత పతకం ఖాయం చేశారు. దీంతో అండర్-15, 17 కేటగిరీల్లో భారత్‌కు ఇప్పటి వరకు 21 పతకాలు ఖరారయ్యాయి. మహిళల అండర్-17 సెమీస్‌లో ఖుషి చాంద్, అహనశర్మ, జన్నత్, సిమ్రన్‌జీత్‌కౌర్, హర్సిక, అన్శిక ప్రత్యర్థులపై విజయాలతో తుదిపోరులో నిలిచారు. మరోవైపు పురుషుల విభాగంలో దేవాంశ్ వియత్నాం బాక్సర్‌పై గెలిచి పసిడి పోరుకు అర్హత సాధించాడు.

# గ్రూప్-1 అభ్యర్థులకు 20 వేల జరిమానా

- తప్పుడు వివరాలతో అఫిడవిట్ దాఖలుకు శిక్ష
- వారిపై ప్రాసిక్యూషన్ చర్యలు తీసుకోవాలని ఆదేశం
- మూల్యాంకనంపై పిటిషన్లు డిస్మిస్ : హైకోర్టు కీలక తీర్పు



హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ అవాస్తవాలతో కూడిన అఫిడవిట్ దాఖలు చేసిన అభ్యర్థులకు హైకోర్టు రూ.20 వేలు జరిమానా విధించింది. తప్పుడు అఫిడవిట్ దాఖలు చేసిన అభ్యర్థులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జ్యుడీషియల్ రిజిస్ట్రార్‌ను ఆదేశిస్తూ హైకోర్టు సోమవారం కీలకమైన తీర్పు ఇచ్చింది. గత ఏడాది ఫిబ్రవరి 2న గ్రూప్-1 పోస్టుల భర్తీకి వెలువడిన నోటిఫికేషన్ ప్రకారం అక్టోబర్‌లో పరీక్షలు నిర్వహించారు. గ్రూప్-1 మెయిన్ పరీక్షల్లో మూల్యాంకనం. ఫలితాల వెల్లడికి అమలుచేసిన విధానం లోపభూయిష్టంగా ఉన్నదని, రీవాల్యుయేషన్ చేసి పారదర్శకంగా ఫలితాలు వెల్లడించేలా టీజీపీఎస్సీకి ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ పలు జిల్లాలకు నుంచి కే ముత్తయ్య సహా 19 మంది హైకోర్టును ఆశ్రయించారు. వీరి పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక సోమవారం తుది తీర్పును వెలువరించారు.

#### ఇరుపక్షాల వాదనలు..

తొలుత పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. మూల్యాంకనానికి టీజీపీఎస్సీ అనుసరించిన విధానం వల్ల పెద్ద సంఖ్యలో అభ్యర్థులు నష్టపోయారని చెప్పారు. మార్కుల మెమోకు-వెబ్‌సైట్ నోట్‌కు వ్యత్యాసం ఉన్నదని చెప్పారు. దీనిపై టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది సీఎస్ రాజశేఖర్ ప్రతివాదన చేస్తూ, పిటిషన్లకు విచారణార్హత లేదని, తప్పుడు పత్రాలతో అఫిడవిట్ దాఖలు చేశారని, పిటిషన్లను కొట్టేయాలని కోరారు. తప్పుడు సమాచారం ఇచ్చి కోర్టు ద్వారా లబ్ధి పొందాలనే ప్రయత్నాలను అడ్డుకోవాలని, ఈ మేరకు మెమో దాఖలు చేసినట్టు చెప్పారు. వాదనల తర్వాత హైకోర్టు.. పిటిషనర్లు నకిలీ డాక్యుమెంట్లతో తప్పుడు అఫిడవిట్ దాఖలు చేసినట్టు స్పష్టమవుతున్నదని పేర్కొంది. రాజ్యాంగంలోని 226వ అధికరణం కింద పిటిషనర్లకు ఉపశమనం కల్పించకుండా.. పిటిషన్లను కొట్టివేస్తూ, వారికి రూ.20 వేలు జరిమానా విధిస్తున్నట్టు ప్రకటించింది. ఈ మొత్తాన్ని హైకోర్టు న్యాయమూర్తుల కోర్టు మాస్టర్స్ పర్సనల్ సెక్రటరీస్ అసోసియేషన్‌కు చెల్లించాలని ఆదేశించింది.

# అభ్యర్థుల సంఖ్య పెరిగింది నిజమే!

మొదటిపేజీ తరువాయి...

ఉత్తర్వులను రద్దుచేయాలని కోరుతూ టీజీపీఎస్సీ ద్విసభ్య ధర్మాసనం ఎదుట అప్పీల్ పిటిషన్ దాఖలు చేసింది. టీజీపీఎస్సీ అదనపు కార్యదర్శి సుమతి (నోడల్ ఆఫీసర్ -లీగల్ ) ఈ అప్పీల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. గత ఏడాది అక్టోబరు 21 నుంచి 27 వరకు జరిగిన మెయిన్ పరీక్షలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల (మూడు కమిషనరేట్లు) పరిధిలో జరిగాయని తెలియజేసింది. పరీక్షలు పూర్తవగానే సూపరింటెండెంట్లు ఇచ్చిన సమాచారం ఆధారంగా హాజరైన అభ్యర్థుల సంఖ్యను 21,075 అని ప్రకటించామని పేర్కొంది. ఆ తరువాత అభ్యర్థులు ఉపయోగించిన, ఉపయోగించని జవాబు పత్రాలు ఓఎంఆర్, నామినల్ రోల్స్ మొత్తం విశ్లేషించిన మీదట వారి సంఖ్య 21,085కు పెరిగిందని వివరించింది. పది మంది అభ్యర్థుల సంఖ్య పెరగడం వెనుక లెక్కింపుల్లో తేడా జరిగిందని తెలిపింది. ఆ మేరకు మళ్లీ ప్రకటన విడుదల చేశామని పేర్కొంది. బీ పూజితారెడ్డి అనే అభ్యర్థిని రీకౌంటింగ్‌లో తేడా ఉందని 60 మార్కులు తగ్గాయని వినతిపత్రం సమర్పించారని, దీనిని పరిశీలిస్తే కౌంటింగ్‌కు ముందు ఆ తర్వాత కూడా ఆమె మార్కులు 422.4 వచ్చాయని, ఆమె వినతిపత్రంలో మార్కులను తారుమారు చేసి ఇచ్చారని అప్పీల్ పిటిషన్‌లో వివరించారు.

#### గందరగోళం నివారణకే వేరే హాల్‌టికెట్లు

పరీక్ష కేంద్రాలను గుర్తించడానికి, తనిఖీలు చేయడానికి టీజీపీఎస్సీకి తగిన సిబ్బంది లేకపోవడంతో ఆ బాధ్యతను జిల్లా కలెక్టర్లుకు ఇచ్చామని తెలిపారు. కోఠి మహిళా కాలేజీలో పురుషులకు ప్రత్యేక మరుగుదొడ్లు లేకపోవడంతో ఆ కేంద్రాన్ని మహిళా అభ్యర్థులకు మాత్రమే కేటాయించామని పేర్కొన్నారు. బేగంపేట కాలేజీలో కేవలం మహిళలే ఉన్నారని, కోఠి మహిళా కళాశాలలోని రెండు సెంటర్ల నుంచి ఎక్కువమంది అర్హత సాధించారన్న ఆరోపణలు అవాస్తవమని తెలిపారు. 18వ సెంటర్‌లో 5.41 శాతం, 19వ సెంటర్‌లో 4.12 శాతం చొప్పున అభ్యర్థులు అర్హత సాధించడం అసాధారణ విషయమేమీ కాదని అన్నారు. ఒకే సెంటర్ నుంచి ఎక్కువ మంది ఎంపికవడంలో తప్పేమీలేదని తెలిపారు. ఎస్టీ క్యాటగిరీలో టాప్ ర్యాంకు 206 కాదని, ఎరుకుల సామాజికవర్గానికి చెందిన యువతికి 12వ ర్యాంక్ వచ్చిందని తెలియజేశారు. ప్రిలిమ్స్ రాష్ట్రవ్యాప్తంగా జరిగినందున హాల్ టికెట్లపై జిల్లా, పరీక్ష కోడ్ వేయాల్సివచ్చిందని వివరించారు. అయితే, మెయిన్ పరీక్ష కేవలం జీహెచ్‌ఎంసీ పరిధిలోనే నిర్వహించినందున కోడ్‌ల విషయంలో అయోమయం ఏర్పడకుండా ఉండేందుకే మళ్లీ వేరే హాల్‌టికెట్లు ఇవ్వాల్సివచ్చిందని వివరించారు. బొమ్ము పూజితరెడ్డి అనే అభ్యర్థి తనకు రీకౌంటింగ్ తర్వాత మార్కులు తగ్గాయని తప్పుడు వినతిపత్రం ఇచ్చారని, ఆమెపై సర్వీస్ కమిషన్ చర్యలు తీసుకుంటుందని తెలిపారు.





#### అదనపు పరీక్ష కేంద్రం ఎందుకంటే..

సీవీఆర్ కాలేజీలో మొదట 984 మంది అభ్యర్థులకు ప్రతిపాదన చేశామని, మహిళా విశ్వవిద్యాలయంలోని పరీక్ష కేంద్రంలో గ్రౌండ్ ఫ్లోర్ ఎత్తు ఎక్కువగా ఉన్నందున దివ్యాంగులకు ఇబ్బంది అవుతుందని భావించి ఇక్కడి నుంచి 87 మందిని సీవీఆర్ కాలేజీకి కేటాయించామని టీజీపీఎస్సీ తన అప్పీల్‌లో వివరించింది. దీని ఫలితంగా మహిళా విశ్వవిద్యాలయంలో అభ్యర్థులు 984 నుంచి 787కు తగ్గారని తెలిపింది. సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కాలేజీలో అభ్యర్థుల సంఖ్య 504 నుంచి 358 మందికి తగ్గిందని, 24 మంది సామర్థ్యం ఉన్న గదిలో దివ్యాంగులకు తోడుగా పరీక్ష రాయడానికి వచ్చే వారు ఉన్నందున, ఒక్కో గదిలో ఆరుగురినే కేటాయించాల్సి వచ్చిందని తెలియజేసింది. దీనివల్ల అదనంగా మరో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సివచ్చిందని తెలిపింది. మూల్యాంకనం కోసం ఇంగ్లిష్‌కు 33, జనరల్ ఎస్సే 57, చరిత్ర, సంస్కృతి 28, జాగ్రఫీ 22, ఇండియన్ సొసైటీ 22, రాజ్యాంగం 24, పరిపాలన 23, ఆర్థికశాస్త్రం, అభివృద్ధి 38, సైన్స్ అండ్ టెక్నాలజీ 21, బయోటెక్నాలజీ 26, డాటా ఇంటర్‌ప్రిటేషన్ 18, తెలంగాణ ఉద్యమం, రాష్ట్రం ఏర్పాటు అంశానికి 40 మంది చొప్పున కేటాయించామని వివరించింది.

## గ్రూప్-1 నియామకాలపై స్టే కొనసాగింపు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గ్రూప్-1 నియామకాలను తాత్కాలికంగా నిలిపివేస్తూ ఈ నెల 17న జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు పొడిగించింది. గ్రూప్-1 మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయంటూ ఎం పరమేశ్ మరో 20 మంది అభ్యర్థులు దాఖలు చేసిన కేసులో న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ఈ నెల 17న నియామకాల ప్రక్రియను నిలిపివేయాలని ఆదేశాలిచ్చారు. ఆ వ్యాజ్యం సోమవారం విచారణకు వచ్చినప్పుడు.. సర్వీస్ కమిషన్ న్యాయవాది జోక్యం చేసుకుంటూ మధ్యంతర ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని కోరుతూ టీజీపీఎస్సీ ద్విసభ్య ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేసినట్టు చెప్పారు. దీంతో విచారణ వాయిదా పడింది. మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని వెల్లడించింది.